# రాలిన చింతపండు

**శి**వరాత్రి దాటి వారం రోజులైంది.

పదిగంటలకే ఎండలు మెండుగా ముదిరాయి.

పొద్దు తిరుగుడు చేల వద్దకు చిలుకల కావలి వెళ్ళిన వాళ్ళు ఇళ్ళకు తిరిగొస్తున్నారు.

ఆరోజు ఆదివారం కాబట్టి ఇంటివద్దే వున్నాను.

ఇంటి ముందున్న పెద్ద అరుగుపై వేపచెట్టు నీడన కూచొని మా దొడ్లో దానిమ్మ చెట్టుమీద వాలే చిలుకల కేసి చూస్తున్నాను. ఆనందంగా, మధురంగా కిలకిల ధ్వానాలు చేసుకుంటు దానిమ్మ పళ్ళను వొల్చి, విత్తుల్ని చీల్చి లోపలి పప్పు తింటున్నాయి. ఎర్రటి ముక్కు కదల్చుతూ మెల్లగా కొమ్మల మీద నడుస్తోన్న చిలకల్ని చూస్తోంటే అదిలించ బుద్ధి కాలేదు. మా నాన్న బెదిరించమంటాడు వాటిని. "ఎవరెవరో పిల్లలు పీకుతుంటారు కాయల్ని. చిలుకలు తింటే తప్పేమిటి?" అంటాను నేను.

నా ఆలోచనలలో నేనుండగానే మా కల్లాల వైపు నుంచి ఏదో గలభా విన్పించింది. ఎవరో ఆడాళ్లు గోల గోలగా తిట్టుకుంటూ వూర్లోకి వచ్చారు. చేలకాన్నించి వచ్చే వాళ్ళు గుంపయ్యారు.

గురమ్మ శేషమ్మ మీద కలబడింది. "నా సింతకాయలు నాకియ్యే లంజా!" అంటూ జుట్టు పట్టుకుంది.

"నీ య్యబ్బని సొమ్ము లేదులేయే దొంగనాసవితీ!" అంటూ శేషమ్మ కూడా గురమ్మ జుట్టు పట్టుకుంది.

కొద్దిసేపు హోరా హోరీగా యుద్ధం జరిగింది.

అమ్మలక్కలు వాళ్ళను చెరోవైపు పట్టి లాగుతోన్నా జుట్టు పట్టుకున్న చేతులు వూడి రాలేదు. సిగలు తెగి వస్తేగాని పట్టు వదిలేట్టు లేదు.

పైటలు జారాయి.

కోక ముడులు వీడాయి.

పోకిరి కుర్రాళ్ళు కొందరు యీలలేస్తున్నారు. మగాళ్ళు చూస్తున్నారే తప్ప వెళ్ళి విడిపించలేని పరిస్థితి.

అంతలో బుద్దయ్యగారి శేషయ్య ఆ దారిన వెళ్తూ ఆగాడు. ఒక్క నిమిషం వాళ్ళకేసి తదేకంగా చూసి చేతి కర్రతో ఇద్దరి పిర్రల మీద అంటించాడు. ఉలిక్కిపడి జుట్టు వదలకుండానే అతనికేసి చూశారు వాళ్ళు.

"కాసేపుంటే మీ కోకలు వూడిపోతాయ్. మేమంతా సూల్లేక ఇండ్లల్లోకి దూరి వాకిలేసుకోవాల్నే ముండల్లారా!" అన్నాడు.

నవ్వులతో నిండిపోయింది. ఆ ప్రాంతమంతా. ఆ సందట్లో ఇద్దర్నీ విడదీశారు అమ్మలక్కలు.

గుడ్డల్ని సవరించుకొంటూ, కొప్పుల్ని ముడేసుకొంటూ నోటి యుద్ధం మొదలెట్టారు ఇద్దరూ.

"మా సింతకాయలు తగల్ను సిగ్గులే దంటనే నీకు?" గట్టిగా అరిచింది గురమ్మ.

"నీ కల్లం కాడికి రాలే. నీ ఇంటి కాడికి రాలే. నీ సొమ్ము తగల్లే. సిద్దులచ్చుమయ్యోల్ల సేలో రొండేరుకొన్నే తిండానికి" శేషమ్మ చెప్పింది.

"అయ్యోవురియ్. నీయమ్మ మొగునియా?" అంటూ గురమ్మ మళ్ళీ శేషమ్మ మీది కెళ్ళబోయేసరికి చుట్టూ ఉన్న వాళ్ళు ఆపారు.

కొద్దిసేపు తిట్ల యుద్ధం అనంతరం ఇంటివద్ద పిల్లలు ఏడుస్తూంటారనో, ఇంకా సంకటి చేయలేదనో జ్ఞప్తికొచ్చింది కాబోలు తిట్లు ఆపకుండానే ఎవరిదారినవారు వెళ్లారు.

ప్రస్తుతానికి యుద్ధం దాదాపు ముగిసినట్లే! సంకటి తిన్న తర్వాత మళ్లీ మొదలవ్వొచ్చేమో?

వాళ్ళ పరిస్థితి అలాంటిది.

ఆర్థికంగా ఏ చిన్న ఆసరా దొరికినా సమస్యల సముద్రాన్ని యీదరి నుంచి ఆదరికి ఈదేందుకు సిద్ధపడే వాళ్ళు.

వాస్తవానికి చెట్లు గురమ్మవే అయినా వాటి సగం కొమ్మలు మా చేలోకి వ్యాపించి ఉన్నాయి. మొదళ్ళు మాత్రం వాళ్ళ కళ్ళం పరిధి దాటి ఇవతలకి రాకుండా జాగ్రత్త పడ్డారు. చెట్ల పూసర వల్ల మా చేను దాదాపు అర్దెకరా భూమిలో మొలక మొలవదు. చెట్ల కాయలు మేము తినేందుకు లేదు. ఎప్పట్నించో అలా జరిగిపోతోంది. అందుకేనేమో శేషమ్మ మాపేరు వాడుకొంది.

మధ్యాహ్నం అన్నం తిని దొడ్లో దానిమ్మ చెట్టుకింద మంచమేసికొని పడుకొని వున్నాను. పాపలిద్దరూ చాలా సేపు అల్లరి చేసి చేసి నాకు చెరో వైపు ముడుచుకొని నిద్రబోయారు.

నాకింకా నిద్ర పట్టలేదు.

ఇంట్లోకి ఎవరో ఆడమనిషి వచ్చింది కాబోలు ఇందిర మాట్లాడ్తోంది. మాటలేవీ వినిపించలేదుగాని వాళ్ళ గుసగుసల్ని బట్టి వినదగిందే అనుకొన్నా.

చివరగా ఒక్కమాట విన్పించింది.

"మాపిటేల బాగుజేసి తెచ్చిస్తాలేమ్మా!" అంటోంది అవతలి మనిషి.

'విశేషమయితే ఎలాగూ ఇందిర వచ్చి చెబుతుంది గదా'ని కళ్ళు మూసికొన్నాను. ఏదో పన్జేసుకొంటూ ఆమె దొడ్లోకి రాలేదు.

అంతలో నిద్రొచ్చింది.

లేచేసరికి మూడు గంటలైంది.

ఐదు వరకు రాసికొని తర్వాత లేచి చేలకేసి వెళ్ళాను.

మా కళ్ళాలు దాటేసరికి మొదలయ్యాయి ఆ శబ్దాలు. పొద్దు తిరుగుడు నేల మధ్యనించి నిర్విరామంగా ఎగిసివచ్చే కేకలు. మంద్రంగా మోగుతూ ఒక్కసారిగా బలం పుంజుకొనే కేకలు. కేకలకు అనుగుణంగా చిలుకలు పూల మీద వాలబోతూ, లేస్తూ, దూరంగా సాగుతూ అందంగా కన్పిస్తోంది వాతావరణమంతా.

ఏచేలో చూసినా చేని మధ్యలో మంచె. మంచె మీద మనిషి. మనిషి చేతిలో వడిసెల. ఎగిరే రాళ్ళకు, కేకలకు బెదిరి శపిస్తూ దూరంగా దూసుకెళ్ళే చిలుకలు. నిర్విరామంగా ప్రవహిస్తోన్న అరుపుల అలలు. బంగారు రంగు వెలుగుల్లో బంగారుపూలు.

అక్కడక్కడా ముదిరిన పూల గింజల్ని కొరుక్కు తింటూ చీకటి పడేంతవరకు వుండి ఇంటికి చేరుకున్నాను.

పిల్లలకు స్నానం చేయించి నా వద్దకు పంపింది ఇందిర. వాళ్ళకు చెరొక టవాల్ చుట్టి కబుర్లు చెప్పించుకొంటున్నాను.

"అయ్యో! నువ్వు ఓబుళం పోతున్నావు కదూ!" పావని అడిగింది.

రెండు చేతుల్తో నా మొహాన్ని తనకేసి తిప్పుకొని, "కదూ!" అని తనూ అడిగింది చిన్నపాప శ్రావణి.

ఆ అభినయానికి నవ్వొచ్చింది.

"కదూ మరి!" అన్నాను నేనూ.

వెంటనే సిగ్గుపడిపోతూ మొహానికేసి కొట్టింది. తర్వాత ఇద్దరూ తనకు ఏమేమి కావాలో చెప్పసాగారు.

"అన్నీ మీకే అయితే నాకో" ఇందిర అంది.

"నీక్కూడా" శ్రావణి చెప్పింది.

"అమ్మకేం తేవాలి?" అడిగాను.

"పెద్ద గౌను" పావని.

"చిన్న డ్రాయరు" శ్రావణి.

ఫక్కున నవ్వాను నేను. సిగ్గుతో ముడుచుకు పోయింది ఇందిర.

అంతలో పంచలోంచి "ఇందిరమ్మా!" అంటూ పిలుపు.

"ఓ... వస్తాండ" దొడ్లోంచి ఇంట్లోకెళ్ళింది.

తొంగి చూశాను 'ఎవరో'నని.

శేషమ్మ!

ఉదయం వొంటి మీద గుడ్డలూడేలా కొట్లాడిన శేషమ్మ.

ఆశ్చర్యమేసింది.

"ఇదిగోమ్మా! పిచ్చగొట్టి తెచ్చినా తీసుకోమ్మా!" అంటూ వొడి ముందుకు చాచింది. ఇందిర చేట తెస్తే అందులో వేసింది.

నాకు ఆశ్చర్యం అధికమైంది.

చేటలో చింతపండు. కొత్త చింతపండు.

శేషమ్మ రావటమే విడ్డూరం. అందులోనూ చింతపండు తెచ్చివ్వటం పెద్ద విడ్డూరం.

"అది కలబడిందంటనే నీమీద? నాకిచ్చినావని తెలిస్తే నన్నూ ఆడిపోసుకుంటదేమో?" ఇందిర అంది.

"దానెమ్మ మొగుని సొమ్మా?" కోపంగా అంది శేషమ్మ. "మీ సేనంతా ఆసెట్లతోనే నాశినమైంది. నాయానికి మీ పక్క కొమ్మల కాయలన్నీ మీకే రావల. అందుకే నేనేరకొచ్చి మీకిస్తాంఁడ" అంది.

"ఏమోనే!దాన్నోరు మంచిది కాదు."

"నిన్నేమన్నా అంటేనా.. సీల్చి పెట్టనూ...రేపు యింత ఏరకొచ్చి యిస్తానమ్మా! పిల్లోడు బాగుపడ్తే సాలు" అంది.

ఆశ్చర్యంతో బాటు మనస్సులో చిన్నగా ఆందోళన కూడా కలిగింది నాకు. ఎన్నో యేళ్ళుగా గుండెల్లో ఏమూలో వొదిగి ఉన్న సన్నని సమస్యకు యీరోజు శేషమ్మ ఆకాశమంత ఆకారాన్ని తొడిగింది. రేపు వీధుల్లో నిలబెట్టేందుకు కూడా వెనుదీయదు.

మాకు జరుగుతున్న అన్యాయం తెలుసు. అయితే వాళ్ళ నోళ్లకూ, బీదతనానికి జడిసి మేమెప్పుడూ యీసమస్యలు బైట పెట్టుకోలేదు.

ఇందిరకు శేషమ్మకు మధ్య ఏదో వొప్పందం కుదిరినట్లుగా వాళ్ళ మాటల వల్ల అర్థమవుతోంది.

స్వల్పంగా డబ్బిచ్చి కొనుక్కొంటోంది కాబోలు.

లేక వరి బియ్యం పెడుతోందో?

ఇందిర ఇలాంటి వ్యవహారాలు కూడా నిర్వహిస్తోందంటే విచిత్రంగా ఉంది. అందుకే కాబోలు మొన్నటిదాకా పండు మిరపల వూరగాయ పచ్చడిలోకి చింతపండు కొనుక్కురమ్మని చెబుతూ నిన్న అకస్మాత్తుగా వద్దంది.

ఏమైనా మనదనుకొన్నప్పుడు మనమే పోట్లాడితే బావుంటుంది గాని శేషమ్మను బలిపశువును చేయటం నాకు నచ్చలేదు.

ఆమె సంపాదించుకొన్న సొమ్మును దోపిడీ చేయడం అస్సలు నచ్చలేదు.

అన్నం తింటున్నపుడు అడిగాను."ఎంత లెక్కిచ్చావు శేషమ్మకు?" అని.

చారు పోస్తూ "ఎందుకూ?" అంది ఆశ్చర్యంగా.

"చింతపండుకు"

"ఏమివ్వలే."

"వూరకే ఇచ్చిందా?"

"ఆ..."

"మీ చుట్టమా?"

"పిల్లోనికి జరమొచ్చిందంట"

"జరమొస్తే...?"

"పొద్దున్నే యిన్ని కాఫీ నీల్లిచ్చి పైటేల మాపిటేల యింత చారు బువ్వ పెట్టమంది" చెప్పింది.

"అన్యాయం. అదమ్ముకొంటే ఇంట్లో అందరూ తినొచ్చుగదా!"

"ఒక్కపూట తినొచ్చు. ఇంట్లోచేస్తే అందరికీ జెయ్యాల. ఒక్కపూట తింటే మిగతా రొండుపూటలా జరమొచ్చిన పిల్లోనికి ఏం బెట్టాలి?"

"ఊరకే పెట్టకూడదా నువ్వు!"

నాకేసి వింతగా చూసింది.

"అదేం కొనుక్కొచ్చి యివ్వలేదులే" అంది.

"కొట్లాడి కొట్లాడి గురమ్మ చేత సగం జుట్టు పీకించుకొంది పాపం."

"అది వాండ్లకు మామూలే లే. దాన్తో గాకుంటే యింకో దాన్తో. అందుక్కాకుంటే మరొకందుకయినా కొట్లాడ్తంటరు" అంది.

నాకు మనస్సులో గిలిగానే ఉంది. ఉదయం శేషమ్మ కొట్లాడిన తీరూ, ఆ శ్రమ ఫలితాన్ని ఇందిర పొందిన విధమూ నన్ను వెంటాడ్డం మొదలెట్టాయి.

"నేను చింతపండు తీసికోకుంటే ఇంకోకమ్మకయినా యిచ్చి అవసరం బూడ్సుకొంటది. మన చేలో రాలిన చింతపండు ఎవురో ఎందుకు తినాల?" చెప్పింది ఇందిర.

నాలో రచయిత సర్దుబాటు కాలేకున్నాడు.

చివరకు చెప్పాను "జ్వరం మాత్రలున్నాయి. అవన్నా యివ్వు" అని.

చిన్న పిల్లాణ్ణి చూసినట్లు నాకేసి చూసింది ఇందిర.

'సరే' నంది.

కొద్ది సేపటికి నేను సర్దుకు పోయాను. తరతరాలుగా వస్తోన్న అనువంశిక లక్షణాలు నన్ను మామూలు మనిషిని చేశాయి.

◆ *రచన మంత్లీ - డిసెంబర్, 94* ◆